పోలింగ్ సజావుగా సాగేలా..

పోటీ చేస్తున్న 45 మంది అభ్యర్థుల జాబితాను గోడకు అంటిస్తున్న ఎన్నికల సిబ్బంది

ఓటర్లు తీసుకురావాల్సిన గుర్తింపు కార్డుల వివరాలను గోడపై ప్రదర్శిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలతో నిఘా

- పోలింగ్ బూత్‌ల్లో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- సీసీ కెమెరాలతో నిఘా
- పోలీసులతో పటిష్ట బందోబస్తు

బన్సీలాల్‌పేట్, మే 12: నగరంలో సోమవారం జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బన్సీలాల్‌పేట డివిజన్‌లోని 60 పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆదివారం మధ్యాహ్నం వరకు తొమ్మిది మంది సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు సామగ్రితో చేరుకున్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లు, ఫంక్షన్ హాళ్లు, ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరిసరాలను శుభ్రం చేసి, ఎండలు తీవ్రంగా ఉండటంతో ఓటర్ల కోసం ప్రత్యేకంగా టెంట్‌లను, తాగునీటి సదుపాయం కల్పించారు. ప్రతి బూత్‌లో ప్రత్యేకంగా సీసీ కెమెరాలను అమర్చారు. స్థానిక లా అండ్ ఆర్డర్ పోలీసులతో పాటు అదనంగా సీఆర్‌పీఎఫ్ సాయుధ పోలీసులు బలగాలు కూడా విధుల్లో ఉన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఓటర్లు జాబితాలో పేర్లున్న ప్రతి ఓటరు ఆధార్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ లాంటి 13 ప్రభుత్వ గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకదానిని చూపించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రజలు తప్పనిసరిగా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని వారు వారు కోరారు.

ఎన్నికల నిర్వహణకు సకల ఏర్పాట్లు

- మల్కాజిగిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలకు సర్వం సిద్ధం
- రిటర్నింగ్ అధికారి మధుకర్‌నాయక్

వెస్లీ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్వో మధుకర్‌నాయక్

కంటోన్మెంట్/ బొల్లారం, మే 12: మల్కాజిగిరి లోక్‌సభ, కంటోన్మెంట్ ఉప ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుకర్ నాయక్ తెలిపారు. బేగంపేటలోని వెస్లీ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో సిబ్బంది సామగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఈవీఎం యంత్రాలను సదురు పోలింగ్ కేంద్రాల సిబ్బందికి అప్పజెప్పాలని సూచించారు. రిజర్వ్ ఈవీఎం యంత్రాలు, రిజర్వ్ పోలింగ్ సామగ్రి, సెక్టార్ అధికారుల వద్ద భద్రంగా ఉండాలని, ఎన్నికల నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లేందుకు సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది

కంటోన్మెంట్ ఉప ఎన్నిక పోలింగ్‌కు సంబంధించి 232 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 2,53,700 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో ఓటర్లందరూ తప్పని సరిగా సోమవారం జరిగే పోలింగ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు అవసరమైన తాగునీరు, క్యూలైన్ల వద్ద టెంట్లు, టాయిలెట్లు ఇతర సౌకర్యాలు కల్పించమన్నారు. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన ర్యాంప్, వ్రీల్ సైకిల్ ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలు, పోలీసు అధికారులతో పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు.

కంటోన్మెంట్‌లో ఐదు మోడల్ పోలీస్ స్టేషన్లు, మరో ఐదు మహిళా పోలింగ్ కేంద్రాలు దివ్యాంగుల కోసం ఒకటి, యువత కోసం మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 22 సెక్టార్లలో సుమారు రెండువేల మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను అమర్చామని, ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత బహుజనులదే..

- డీఎస్ఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి నీరుడు కృష్ణ

సికింద్రాబాద్, మే 12: రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత బహుజనులందరిదని దళిత సంఘర్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరుడు కృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భారతీయ జనతా పార్టీ రాజ్యాంగాన్ని మార్చాలనే ధోరణిలో ఉందన్నారు. అందుకే బీజేపీ హఠావో.. రిజర్వేషన్లు బచావో... అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. రాజ్యాంగం ద్వారానే దళిత బహుజనులకు రిజర్వేషన్ ఫలాలు అందుతున్నాయన్నారు. ప్రజలు ఆగం.. ఆగం... కావొద్దని, ఆలోచించి ఓటు వేయాలన్నారు.

దళిత సంఘర్షణ సమితి (డీఎస్ఎస్) భారతదేశంలో రాజ్యాంగాన్ని రక్షించాలన్నా, రాజ్యాంగ పరిరక్షణ కోసం దళిత సంఘర్షణ సమితి రాష్ట్ర కమిటీ తరుపున బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజలకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. భారత రాజ్యాంగం యథావిధిగా ఉండాలంటే దేశంలో ఇతర పార్టీ అధికారంలోకి రావాలని ఆయన పేర్కొన్నారు.

అర్హులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలి

సికింద్రాబాద్, మే 12: లోక్‌సభ ఎన్నికల్లో అర్హులంతా ఓటు హక్కును వినియోగించుకోవాలని బీఆర్ఎస్ సీతాఫల్‌మండి సీనియర్ నాయకుడు గరికపాటి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ భవిష్యత్ ఓటు మీదే ఆధారపడి ఉందన్నారు. ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రధానంగా మొదటి సారి ఓటు హక్కు పొందిన యువత కచ్చితంగా తమ ప్రాథమిక హక్కు అయిన ఓటును వినియోగించుకుని, స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆయన కోరారు.

మాతృ దినోత్సవం

మాదాపూర్, మే 12: సమాజంలో అమ్మది ప్రత్యేక స్థానమని లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా విజయ్ కుమార్ అన్నారు. మాతృ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం హుడా కాలనీలోని లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ కార్యాలయం వద్ద పలువురు మాతృమూర్తులకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... సమాజంలో అమ్మది ప్రత్యేక స్థానమని, దేవుడు అన్ని చోట్ల ఉండలేక అమ్మని సృష్టించాడని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మారాం వెంకటేశ్వర్లు గుప్తా, మధుసూదన్‌రెడ్డి, విజయ్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అమ్మవారి ఊరేగింపు

శంకర జయంతి సందర్భంగా ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయంలో భాజా భజంత్రీలతో ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ మనోహర్‌రెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. – బేగంపేట్

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

అన్నదానం చేస్తున్న ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ సంజీవ్‌కుమార్, పావని

బన్సీలాల్‌పేట్, మే 12: పద్మారావునగర్‌కు చెందిన స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 252వ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలు తప్పనిసరిగా ఓటు వేయాలని కోరారు.

అనంతరం రోడ్ల పక్కన ఉంటూ ఆకలితో అలమటించే వృద్ధులను, నిరాశ్రయులను, దివ్యాంగులను అప్యాయంగా పలకరించి వారికి భోజనం సమకూర్చామని స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని తెలిపారు. పాదచారులు, ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్లకు మజ్జిగ అందజేశామని పేర్కొన్నారు.ఎండలకు అల్లాడుతున్న అనాథలు, నిరాశ్రయులను చేరదీసి వారికి ఆశ్రయం, ఉపాధి అవకాశాలను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని వారన్నారు. కార్యక్రమంలో స్కై ఫౌండేషన్ సభ్యులు కోమల్, మానస, అఖిల్, శుభం తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహార ప్యాకెట్లు పంపిణీ

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార ప్యాకెట్లను పంచుతున్న రాయల సేవా సమితి సభ్యులు

అమీర్‌పేట్, మే 12: ప్రపంచ మాతృదినోత్సవం సందర్భంగా ఎస్ఆర్ నగర్ రాయల సేవా సమితి ఆధ్వర్యంలో అమీర్‌పేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార ప్యాకెట్లు, మజ్జిగను పంపిణీ చేశారు. ఆదివారం మధ్యాహ్నం సమితి అధ్యక్షులు ఆర్‌సీ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాతృదినోత్సవంతో పాటు ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని కూడా జరుపుకుంటూ ఆసుపత్రిలో నర్సులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు గర్భిణులు, బాలింతలు మెరుగైన ఆరోగ్యానికి తీసుకోవాల్సిన పౌష్టికాహార వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సీనియర్ వైద్యురాలు డాక్టర్ చంద్రకళ, సమితి కార్యదర్శి విజయశ్రీ, నాగరేఖ, ఛాయాదేవి, ప్రభు, టీవీఎన్ రెడ్డి, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వేణునాదం.. చిత్రగానం

రవీంద్రభారతి, మే 12 : సుధాకర గండి ఫౌండేషన్, నందప్రభ ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలో కళారత్న, వేణుగాన విశారద సంగీత విశ్వభూషణ తల్లారి నాగరాజు, తల్లారి లలిత్ వేణు నాదం–చిత్ర గానం కార్యక్రమం నిర్వహించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం సాయంత్రం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్య నృత్యాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చెన్నై నుంచి విచ్చేసిన భరతనాట్య కళాకారి రక్షా దేవనాథన్, కూచిపూడి నృత్య గురువు చూడామణి తమ శిష్య బృందాలతో కలిసి నర్తించిన పలు అంశాలు అలరించాయి. – కొండాపూర్

ఎన్నికలకు వేళాయె..

బేగంపేటలోని వెస్లీ కళాశాలలో వీవీ ప్యాట్లను పరిశీలిస్తున్న అధికారులు, ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు బస్సులో బయల్దేరుతున్న సిబ్బంది